# మ న క వి

వొట్టి చీకటి దేముంది ?

కాని చీకట్లో జరగటానికి వీలున్న ఘోరకృత్యాలూ జరిగే ఘోరకృత్యాలూ, తలుచుకుంటే భయం, అందుకని ఆవూళ్ళో చీకటి, మిగిలిన వూళ్ళల్లో చీకటికంటే భయంకరంగా వుంది. వూరు, ఇళ్ళు గుర్తుపెట్టి పరచబడ్డ కార్పొరేషన్ మ్యాప్‌లా, పడి వుంది. ఇళ్ళు, స్మశానంలో ఆరిపోయిన కాష్ఠాల్లా వున్నాయి. ఆకు ఆట్టంలేదు. చీకటి స్తంభించి పోయింది. వూపిరే లేదు.

వూపిరే లేదంటే, మానవుల్లో లేదు; ప్రకృతిలో లేదు. కాని వీటికి అతీతుడైన కవిలో ఎందుకుండదు? అతడు గుండెలు జలదరించే ఆభయంలో, చీకట్లో, ఇంట్లో వంటరిగా కూర్చొని కవిత్వ బాధ పడుతున్నాడు, ముక్కులు వుబ్బించుకుంటున్నాడు. బాహ్య ప్రపంచాన్ని మరిచిపోతున్నాడు. చూపుల్ని కేంద్రీకరించాడు. సిద్ధహస్తం—అంటే చేతిలో కలం.

అవి యుద్ధం రోజులు. ప్రపంచ యుద్ధం ప్రపంచం అతలాకుతలం అవుతూవుంది. ఆవూరు జేరింది యుద్ధంలో. తన్ని కనుక్కోలేదు. తనిష్టంలేదు. అందుకనే మరీ భయం. కసాయి వాడి దగ్గరకు గొర్రెతోపాటు, తోకా వెళ్ళింది. గొర్రె కంటే తోకకే భయం. ఎప్పుడొస్తాడో! ఏం చేస్తాడో!! బాంబులు వేస్తాట్ట! ఒక్క బాంబు కొన్ని మైళ్ళని బదాబదలు చేస్తుందిట!

మరొకటి. ఆవూళ్ళో అలకాజనం జాస్తి. చీమలపుట్ట, ఆపుట్ట బద్దలై దోపిళ్ళు సాగించింది. ఒక షాహుకార్ని హత్యచేసింది.

అందుకని వూరంతా వుడికిపోతూవుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని శరీరాలు ఇళ్ళల్లో పెట్టుకొని కాలంగడుపుతూ వుంది జనం. చీకటి పడితే చాలు, బయటికి రావటానికిభయం. లోపల వుంటానికి భయం. మాట్లాడటానికి భయం. వూరుకోటానికి భయం. చావటానికి భయం, బ్రతకటానికి భయం. భయపట్టా నికి భయం. కాని కవి కేం భయం? అంతా తన్మయత్వం— పరవశత్వం. అతని మెదడులో కలాలు కదిలినై. కళ్ళల్లో అక్షు రాలు విరిసినై. సిరా ఎక్కడ? ఇంకెక్కడ? ఉదరములో! రాయటానికి ఉపక్రమించాడు.

ఓసి ప్రియురాలా...

గదిలోని వెలుతురు కదిలింది. కవి హృదయం చలించింది. ప్రియురాలా బాగుందా, ప్రేయసీ బాగుందా? ప్రేయసీలో ఎంత గాంభీర్యం, అగాధం వున్నాయి! భావములో కాదు— మాటలో. భావాల్లో ఏముంది? అన్ని భావాలూ బట్టతల్లే! ముగ్గు బుట్టలే! ప్రేయసీ ఊర్ధ్వలోకానికి లాక్కు వెల్తుంది. ప్రియురాలా పాతాళానికి గుంజుతుంది. కాని ప్రేయసీని అన్నలు వాడారే! అందుకని ప్రియురాలే—

ఓసి ప్రియురాలా!

పైన కవికి తోచలేదు. గిరజాలు గుంజుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. మళ్ళీ తదేకధ్యానం.

అగస్మాత్తుగా పక్కింట్లో రివాల్వరు ప్రేలింది, ఢాం ఢాం ఢాం. ఏడ్పులు, కేకలూ, ఆర్తధ్వనుల్తో చీకటిముక్కలు ముక్కలై తూట్లు తూట్లయ్ తెర పైకి పోయినట్లు కిందకు కూలింది. ప్రకృతి జలదరించింది. ఆకులు కదిలినై, పిట్టలు ఎగిరినై.

కవి విన్నాడు. కావలసింది గ్రహించు కున్నాడు. అదే కవిలో వుంది–అందుకున్నాడు. చీకటిని చూశాడు. దీపాన్ని జరిపాడు. కలం పట్టుకున్నాడు. మొహం విప్పారింది. జుట్టు గిరజాలై, గిరజాలు జుట్టయింది.

వ్రాశాడు :

ఓసి ప్రియురాలా
నా
ఎదలోని ఎదవై
తుపాకి గుండువై...

మళ్ళీ ఆగింది. కవి లేచాడు. నిట్టూర్చాడు. చీకటిని ప్రార్థించాడు. పక్కింటిని చూశాడు. హూరెత్తే, గుండెలు ఠారెత్తే ఏడ్పులు—

దేవుడో దేవుడా
కాల్చేశార్రో
చంపేశార్రో

చీకటంతా ఏడ్చింది. బందిపోటుకి చీకటంటే ఇష్టంగాని, చీకటికి బందిపోటంటే ఇష్టంలేదు. అందుకని హోరున ఏడ్చింది. కవి హృదయం గంతులేసింది. చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు చీకటికంటే నల్లగా వుంది. టేబిల్ దగ్గరకు వెళ్ళాడు. కలం తీశాడు, కలం పద్యాన్ని పూర్తిచేసింది!

ఓసి ప్రియురాలా
నా
ఎదలోని ఎదవై
తుపాకి గుండువై

నన్నేల

కాల్చేదవు!

నన్నేల

మాడ్చేదవు!!

పక్కింట్లో ఏడ్పులు ఎక్కువైనయ్. పిట్టల కాకిగోల-చీకటి చింకులు—ప్రకృతి వికటాట్టహాసం - గోల గోల. ప్రళయం వస్తుందా?

మన కవిమాత్రం పాటపూర్తయ్యిందనే తృప్తితో, తృప్తిని తృప్తి పరుద్దామని పరున్నాడు—ఏ పేపరుకి పంపుదామా అని ఆలోచిస్తూ నిద్రపోయాడు. నిద్రలో వూరుకుంటాడా? వూరుకోడు. మేలుకుంటాడు.

పక్కింళ్ళో? దాని సంగ తేమిటి?

అది మనుష్యుల పని!

కవుల పనీ కాదు.

ఆ పద్యాలు ప్రకటించే వార్తాపత్రికల పనీ కాదు.

★